క్లుప్తంగా

రామచంద్రయ్యకు నివాళి

బూర్గంపాడు: మణుగూరు మండలం బావి కూనవరం గ్రామానికి చెందిన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా.. ఆయన మృతదేహాన్ని బూర్గంపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పోతిరెడ్డి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ధర్నాపై ప్రచారం

గుండాల: కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు ఎనగంటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కాచనపల్లి సుశేన నగర్ సెంటర్‌లో కరపత్రాలను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. గతంలో పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మిక హక్కులను కలరాస్తుందని విమర్శించారు.

మోటర్, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కనీస వేతనాలు నెలకు రూ.27 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు అన్ని రంగాల కార్మికులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ అనుబంధ సంఘ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అటికం శ్రీను, పూసం కృష్ణ, పూనం రోహిత్, కంకటి విజయ్, యనగంటి లాజర్, అటికం శేఖర్, కీసర భాస్కర్ కాంపాటి ఆదిత్య యనగంటి, చిరంజీవి, కీసరి సురేష్, ఎనగంటి అనిల్, ఎనగంటి ప్రశాంత్, కుంజ జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

అశ్వాపురం: భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జ్ కల్లూరి రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురకంటి లింగారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొల్లు లింగారెడ్డి, నాయకులు యాస సురేష్, జీవన్‌రెడ్డి, పసునూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం: బీజేపీ భద్రాచలం మండల కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మారావు, సీనియర్ నాయకులు నిడదవోలు నాగబాబు, నాయకులు ములిసెట్టి నిఖిల్, ముత్యాల శ్రీనివాస్, అల్లాడి వెంకట సుబ్బారావు, సూరత్ సుదర్శన్, అన్నం సాయి లక్ష్మణ్, బోడా సత్యనారాయణ, గడ్డం శ్రీహరి పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

భద్రాచలం: పొట్టి శ్రీరాములు విద్యానిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి ఆలయంలో పేద ఆర్య వైశ్య విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, చారుగుళ్ల శ్రీనివాస్‌ల చేతుల మీదుగా 40 వేల రూపాయలు విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా ట్రస్ట్ ద్వారా ఇటువంటి సేవలను అందిస్తున్న నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మాజీ కోశాధికారి చింతల వినోద్ కుమార్, యశోద రామచంద్ర రావు, చారుగుళ్ల రమేష్, కురిచేటి రామ చంద్రమూర్తి, జనార్దన్‌రావు, శ్రీనివాస్, ఉడతా నగేష్ కుమార్, పచ్చిపులుసు వెంకట సుబ్బారావు, నాళ్ళ సాయి చందు, సంకా కృష్ణార్జునరావు, తూనుగుంట్ల లీలా కృష్ణమూర్తి, బచ్చు చంద్రశేఖర్, కటుకూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గుండాల: గిరిజన సంక్షేమశాఖ, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేడు ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం ఎదుట చేపట్టబోయే నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో సవరించిన సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్‌ను వెంటనే విడుదల, కన్వర్టడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు, పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను పాఠశాల సహాయకులుగా ఉన్నతీకరణ, ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు, జీఓ 317 అప్పీళ్ల పరిష్కరణ తదితర డిమాండ్లతో నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య కేంద్రం

- ఏడాది క్రితమే పూర్తయిన మెజారిటీ నిర్మాణం
- అందుకు రూ.16 లక్షలు ఖర్చు
- మిగిలిన మైనర్ పనులతో ఆగిన ఆరంభం


ఎమ్మెల్యే ఆదినారాయణకు విన్నవిస్తున్న డాక్టర్ సాయికల్యాణ్ (ఫైల్)


నూతనంగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్ బిల్డింగ్

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వినియోగంలోకి రావట్లేదు. రెండేళ్లక్రితం దీని నిర్మాణం ఆరంభించగా, ఏడాది క్రితమే పూర్తయింది. ఐతే చిన్నచిన్న పెండింగ్ పనులు పూర్తికాకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఇది నిరుపయోగంగా మారింది.

ములకలపల్లి మండలకేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్ పరిధిలో 4,396 మంది జనాభా ఉండగా, 40 మంది గర్భిణులు, 32 మంది బాలింతలు ఉన్నారు. ప్రస్తుతం సుందరయ్యనగర్‌లోని అద్దె ఇంట్లో దీనిని నిర్వహిస్తున్నారు. వీరందికీ ఇక్కడే ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని వైఎస్సార్ నగర్‌లో రూ.16 లక్షల వ్యయంతో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధులతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. అరంభించిన ఏడాదిలోనేగా దాదాపు పనులన్నీ పూర్తి చేశారు. రంగులు కూడా వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఇక అందుబాటులోకి వస్తుందని అనుకుంటున్న తరుణంలో కొన్ని పనులను అర్ధాంతంగా ఆపేశారు. దీంతో నేటికి ఇది అందుబాటులోకి రాలేదు.

ఈ కాలనీలో మిషన్ భగీరథ పైపులైను సౌకర్యంలేదు, కనీసం గ్రామపంచాయతీ పైపులైను కూడా అందుబాటులో లేదు. దీంతో సబ్‌సెంటర్‌లో తాగునీటి కోసం బోరు వేసి, మోటార్లు అమర్చాల్సి వుంది. బిల్డింగ్‌లోపల ఎలక్ట్రికల్ వైరింగ్, తలుపులు, కిటికీలకు డోర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటువంటి పనులన్నీ నిలిపోవడంతో ఏడాది కాలంగా నిరుపయోగంగానే ఉంది.

అందుబాటులోకి వచ్చేనా..?

నూతన భవనం సంవత్సర కాలంగా అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక మంగపేట పీహెచ్‌సీ వైద్యుడు సాయికల్యాణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఇటీవల వినతిపత్రం అందజేశారు. 'మనబడి' కార్యక్రమానికి ములకలపల్లికి వచ్చిన ఎమ్మెల్యేను కలసి పెండింగ్ పనులు త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. దీంతో స్పందించిన ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు, ఎమ్మెల్యే చొరవతోనైనా వినియోగంలోకి వస్తుందని స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

అద్దె ఇంట్లో కొనసాగిస్తున్నాం..



నెలకు రూ.2 వేలు అద్దె చెల్లిస్తూ, ఉపకేంద్రాన్ని కొనసాగిస్తున్నాం. నూతన భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించలేదు. పెండింగ్ పనులు పూర్తిచేసి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలి.

– విజయలక్ష్మి, ఏఎన్ఎం

నిధులలేమి వల్లే..



బోరు, మోటారు ఏర్పాటుకు నిధులు మంజూరు కానందువల్ల వాటిని ఏర్పాటు చేయలేదు. పది రోజుల్లో వైరింగ్, తలుపులు, కిటికీల డోర్లు, ఇతరత్రా పనులన్నీ పూర్తి చేసి, బిల్డింగ్‌ను వినియోగంలోకి తెస్తాం.

– సుబ్బరాజు, ఏఈ, ఏటీడీఏ

సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాం


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు తాండ్ర వినోద రావు

అశ్వారావుపేటరూరల్: ఇటీవలే జరిగిన ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటర్ల నుంచి మంచి ఆదరణ లభించిదని, సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద రావు అన్నారు. ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపం ఆవరణలో అశ్వారావుపేట నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై.. ఎంపీ ఎన్నికలపై సమీక్షించారు. ముందుగా జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చి, ప్రధానిగా మోడీ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ పార్టీ గతం కంటే బలపడిందని, దీనికి ఎంపీ ఎన్నికల్లో నమోదైన ఓట్లే నిదర్శనమని అన్నారు. గతంలో బీజేపీ అభ్యర్థులకు రాని ఓట్ల సంఖ్య తనకు రావడంపై ఓటర్లకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీ పోటీ చేస్తుందని ప్రకటించారు. పార్లమెంట్ పరిధిలోని ప్రజా సమస్యలను ఇప్పటికే గుర్తించామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. అదే విధంగా కొత్తగూడెంలో ఎయిర్ పోర్టు గురించి ఇప్పటికే ఆ శాఖ మంత్రిను కలిసి విన్నవించానని, ఈ ఫైల్‌ను బయటకు తీసి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చినట్లు చెప్పారు. అలాగే భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ గురించి త్వరలోనే రైల్వే శాఖ మంత్రిను కలుస్తానని, ఇప్పటికే ఆ శాఖ మంత్రి అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలిపారు. పామాయిల్ రైతుల సమస్యల గురించి కేంద్రంలో ఎంపీలు, రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చిస్తారని, పామాయిల్ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, మండల బాధ్యులు బండారు చంద్రశేఖర్, మద్దాల దేవి, పార్వతీ, పుష్కర కుమార్, జల్లిపల్లి అరవింద్, చిట్టి శ్రావణ్‌కుమార్, చెన్నారావు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే..


సైడ్‌బర్మ్ కోతకు గురైన దృశ్యం

ములకలపల్లి: మార్కెట్ యార్డు సమీపంలోని పాములేరు వాగు వంతెన వద్ద పాల్వంచ -మందలపల్లి బీటీ రోడ్డు సైడ్‌బర్మ్ కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం భారీగా వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఈ బ్రిడ్జికి దిగువ భాగంలో సుమారు 100 మీటర్లలోపే చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో బ్రిడ్జి వద్ద ఎప్పుడూ నీరు నిల్వ ఉంటుంది. దీనికి తోడు ఇక్కడే వాగు మలుపు తిరుగుతూ ప్రవాహం ముందుకు పరవళ్లు తొక్కుతుంది. దీంతో ప్రవాహ ఉధృతికి సైడ్ బర్మ్ తరచూ కోతకు గురౌతోంది. ఇటీవల ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మట్టితో సైడ్‌బర్మ్ వేశారు. ఐతే శనివారం రాత్రి కురిసిన వర్షానికి బర్మ్ రెండుచోట్ల కోతకు గురై కుంగిపోయింది. చిన్నపాటి వర్షానికే ఇలా ఉంటే, ఇక భారీ వర్షాలకు బర్మ్ పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదముంది. కోతకుగురైన బర్మ్ గోతుల్లో వాహనాలు దిగితే భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రదేశంలో రివిట్‌మెంట్ చేయిస్తే తప్ప, వాగు ప్రవాహనానికి సైడ్‌బర్మ్ నిలిచే అవకాశంలేదని అభిప్రాయపడుతున్నారు. అధికారులు దృష్టిసారించాలని పరిష్కరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

నేస్తం ట్రస్ట్ ఆర్థిక సాయం

బూర్గంపాడు: మోరంపల్లిబంజరకు చెందిన నేస్తం వెల్ఫేర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచింది. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నెల్లెల వెంకన్న మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వృత్తిరిత్యా ఆర్టీసీ కండక్టర్ అయిన వెంకన్న.. గతంలో నేస్తం ట్రస్ట్‌లో సభ్యుడిగా కొనసాగుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. మూడేళ్ల క్రితం తీవ్ర అనారోగ్యంతో ఆయన మృతిచెందడంతో.. ఆయన కుటుంబ ఆర్థికంగా చితికిపోయింది. తమ సభ్యుడి కుటుంబానికి అండగా నిలవాలని భావించిన నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు.. అప్పటికే కొంత ఆర్థికసాయందించారు. ఆపై 'సపోర్ట్ వెంకన్న ఫ్యామిలీ' పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారు. మానవతా దృక్పథంతో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు, దాతలు తమవంతు సాయమందించడంతో రూ.3.16 లక్షలు సమకూరాయి. ఆ డబ్బును పిల్లల ఉన్నత చదువులకు వినియోగించాలనే లక్ష్యంతో ట్రస్ట్ ప్రతినిధులు వడ్డీకి ఇచ్చారు. ప్రస్తుతం వెంకన్న పిల్లల చదువుల కోసం ఆ నగదును కుటుంబానికి అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు సమకూరిన


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న ప్రజాప్రతినిధులు, ట్రస్ట్ ప్రతినిధులు

అసలు, వడ్డీ కలిపి రూ.4.44లక్షలను ఆదివారం నేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకన్న కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. నేస్తం ట్రస్ట్ అందిస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, మాజీ సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, కొండ్రు వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మందలపల్లిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని ఆత్మీయ సమ్మేళనం..

దమ్మపేట: మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పూర్వపు విద్యార్థులు, ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించుకున్నారు. ఆ గురుకుల పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదవ తరగతిని అభ్యసించిన విద్యార్థులు, అనాటి పూర్వపు ఉపాధ్యాయులు, ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. విద్యార్థులు ముందుగా పూర్వపు గురువుల క్షేమ సమాచారం తెలుసుకుని, వారిని సన్మానించారు. విద్యార్థుల ఉన్నతిని, క్షేమ సమాచారం తెలుసుకున్న గురువులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఒకరి క్షేమ సమాచారం మరొకరు తెలుసుకుని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఆనందోత్సాహలతో గడిపారు. బాల్య మిత్రులు, గురువులతో కలసి సెల్ఫీలు, గ్రూపు ఫోటోలు తీసుకున్నారు. అలనాటి బాల్య స్మృతులు, మధుర జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు గురువులు భరత్‌బాబు, పీవీఎస్.పాపారావు, పూర్వపు విద్యార్థులు ఐపీఎస్ ర్యాంకు ఉద్యోగి కోట కిరణ్‌కుమార్, పిల్లి సురేష్, ఎనుములేటి కిరణ్‌కుమార్, మత్తే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటిగా కురిసిన వర్షం

అశ్వారావుపేటరూరల్: ఎట్టకేలకు వరుణుడు కరుణించగా.. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. ఇప్పటికే సాగు పనులు మొదలు పెట్టి, వర్షం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అశ్వారావుపేట మండల కేంద్రంతోపాటు, పలు గ్రామాల్లో వర్షం పడటంతో 107 మిల్లి మీటర్ల వర్షం నమోదైంది. సాగు సీజన్ మొదలై, సరిపడా వానలు లేకపోవడంతో విత్తనాలు నాటిన రైతుల్లో ఆందోళన నెలకొనగా, తాజాగా కురిసిన వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల పాటు వర్షం కురిస్తే సాగు పనులు మరింత వేగవంతం అవుతాయని రైతులు చెబుతున్నారు.

మునిగిన ప్రధాన వార్డులు

మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున 2గంటల నుంచి 5గంటల వరకు కురిసిన వర్షానికి మణుగూరులోని ప్రధాన వార్డులు నీట మునిగాయి. సుందరయ్యనగర్‌తో పాటు సత్యభాస్కర్ చిత్రమందిర్ పక్క వీధిలో ఇళ్లలోకి వరద నీరు చేరగా, స్థానికులు నీటిని ఎత్తిపోశారు. వినాయక నగర్‌లో మోకాల్లోతు వరద నీరు చేరడంతో విషసర్పాలు సంచరించాయి. చాకలి ఐలమ్మ నగర్‌లో నేరెళ్ల చెరువు అలుగు పొంగి పూర్తిగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అక్కడ నివసించే రజక కులస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మేదరబస్తీలో వరద నీరు పారే దారి లేక రోడ్లపైనే వరద నీరు మోకాల్లోతు చేరింది. బొగ్గు ఉత్పత్తికి కొంత అంతరాయం ఏర్పడిందని అధికార వర్గాలు తెలిపాయి.

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు..

మణుగూరులో ఒక్కరోజు ఏకధాటిగా కురిసిన వర్షానికి అతలాకుతలమైంది. పట్టణంలోని మురుగు నీరు, చెత్త సేకరణ, డ్రెయినేజీ సమస్యపై పలు మార్లు వినతులు సమర్పిస్తున్నా మున్సిపాలిటీ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


మణుగూరుటౌన్: గాంధీనగర్‌లో మోకాల్లోతు చేరిన వరద నీరు


దమ్మపేట: వర్షపు నీటితో నిండిన పేరంటాల చెరువు

జలకళతో చెరువులు

దమ్మపేట: మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి, చెరువులు నీటితో నిండి జలకళను సంతరించుకున్నాయి. చెరువులు నీటితో నిండటంతో, ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భారీ వర్షపాతం కారణంగా పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరుకుని, నీటి కుంటలను తలపించాయి. మందలపల్లి గ్రామంలోని ఆర్‌టీసీ బస్ స్టేషన్ పక్కనే ఉన్న కాలనీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేని కారణంగా వరద నీరు ఇళ్లలోకి, ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లోకి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎమ్మెల్యేకు పలువురి పరామర్శ


మణుగూరుటౌన్: రాములమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, పక్కన నేతలు

మణుగూరుటౌన్: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జితేష్ ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో పరామర్శించారు. అదేవిధంగా సీపీఐ సీనియర్ నేత పాకాలపాటి వెంకటేశ్వరరావు(పెద్దబ్బాయి), పాకాలపాటి లలితాదేవి, కందుల కృష్ణార్జునరావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మలు పరామర్శించి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మణుగూరురూరల్: రాములమ్మ మరణించిన విషయం తెలుసుకున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పాయం రాములమ్మకు నివాళులర్పించారు. ఎమ్మెల్యేను పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు వంగా వెంకట్, కృష్ణమూర్తి, బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, రామనర్సయ్య, మేకల ఈశ్వర్, శనిగరపు కుమారస్వామి, జానకి ప్రసాద్, సత్యనారాయణ, ఎండి.ఇమాముద్దీన్, భీమ్ సేన్, వెంకటరత్నం పాల్గొన్నారు.

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందటంతో ఆదివారం మణుగూరులో ఎమ్మెల్యే నివాసంలో మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పాయంను పరామర్శించారు. తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, పీ.శ్రీనివాస్, గూడురు శ్రీనివాస్‌రెడ్డి, బుర్రి యాకయ్య, మర్రి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండబత్తుల ఉపేందర్, చిట్యాల సత్యం, కాకర్ల రామారావు, లవకుశ రెడ్డి, కృష్ణమాచారి పాల్గొన్నారు.

పాఠశాలలోకి వర్షపు నీరు

చర్లరూరల్: శనివారం కురిసిన వర్షానికి మండలంలోని పలు పల్లపు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. రాళ్లగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలోకి భారీగా వర్షపు నీరు చేరి లోనికి వెళ్లాలంటేనే కష్టంగా తయారైంది. ప్రతీ ఏడాది వర్షాకాలం వచ్చిందంటే పాఠశాలలోకి వర్షపు నీరు చేరుతుందని, పాఠశాలకు వచ్చే పిల్లలు స్కూలు లోపలికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖా అధికారులు స్పందించి పాఠశాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.


రాళ్లగూడెం పాఠశాలలోకి చేరిన వర్షపునీరు

'ఉపాధి' పైసలు పడట్లే..!

- ఇప్పటికే నిలిచిపోయిన పనులు
- నెల రోజులవుతున్నా అందని కూలి

గుండాల: మండుటెండల్లో పని ప్రదేశాలలో నీడ లేదు..గుక్కెడు మంచినీళ్ల పోయలేదు..చిన్న గాయమైనా మెడికల్ కిట్ ఇవ్వలేదు..ఎంతదూరమైనా ఎండలను లెక్కచేయక గ్రామీణ ఉపాధి హామీ పనులను నిర్వహించారు. రోజుకు మూడు వందలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఎక్కడా అమలు కాలేదు కదా.. వారానికోసారి రావాల్సిన పైసలు కూడా రాలేదు. గత నెల రోజులుగా కూలి డబ్బులు అందలేదు. ఉపాధిహామీ పనులంటేనే పైసలు రానప్పుడు పనులకు పోవడమెందుకని కూలీలు వాపోతున్నారు. ఈ పరిస్థితి గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో నెలకొంది.

గుండాల మండలంలో 5వేల జాబ్ కార్డులు ఉండగా ఈ ఏడాది ఉపాధి హామీ పనుల్లో సుమారు 2వేల మంది కూలీలు పని చేశారు. ఆళ్లపల్లి మండలంలో 4120 జాబ్‌కార్డులు ఉండగా 2800 మంది కూలీలు పనులు నిర్వహించారు. కాగా


గుండాల చెరువులో పనిచేస్తున్న కూలీలు (ఫైల్)

వారికి ఏప్రిల్ నెల వరకు వారాల వారిగా కూలీల ఖతాలో డబ్బులు జమ అయ్యాయి. మే నెల నుంచి ప్రభుత్వ నుంచి డబ్బులు విడుదల కాకపోవడంతో అప్పటి నుంచి వాటి కోసం ఎదురుచూస్తున్నారు. నెల రోజుల నుంచి బ్యాంకుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రోజుకు రూ. 300లు చెల్లించాలని జీవో విడుదల అయింది. కాని కూలీలు చేసిన పనులకు కొలతల ప్రకారమే డబ్బులు జమ అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ డబ్బులు విడుదల చేయాలని కూలీలు వేడుకుంటున్నారు.

ఎండల్లోనూ పనులు చేశాం..

మండుటెండలను లెక్కచేయక ఉపాధి హామీ పనులకు పోయాం. దూరం ఎంతైనా నడిచే వెళ్లాం. కొలతల ప్రకారం చాలా తక్కువ పైసలు వచ్చాయి. రూ.300లు కాదుకదా నెల రోజులుగా చేసిన పనులకే పైసలు రావడం లేదు.

– జి.పాపయ్య, కూలి

నెల రోజులుగా ఎదురుచూపులు

పనుల చేసి నాలుగు వారాలుగా పైసల కోసం ఎదురు చూస్తున్నాం. ఏ రాజుకు ఆరోజు బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరగుతున్నాం. ఎప్పుడు పడతాయో తెలియదు. మళ్లీ పనులంటే ఎలా వెళ్లాలి.

– పి.రమేష్, కూలి

6 వారాలవి పెండింగ్..

ఆరు వారాల నుంచి కూలీల డబ్బులు విడుదల కావాల్సి ఉంది. ఎన్నికల తర్వాత నుంచి ప్రభుత్వం నుంచి విడుదల కావాలి. ఆ నగదు విడుదల అయిన వెంటనే కూలీలకు సమాచారం అందించి కూలి డబ్బులు అందిస్తాం.

– రఘునాథ్, ఆళ్లపల్లి ఏపీఓ